తీన్మార్
విలేకరులు కావలెను
పత్రిక రంగంలో మరో సంచలనం, నిజాయితీ రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో పని చేయుటకు
జిల్లా బ్యూరో చీఫ్ లు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు,
జిల్లా క్రైమ్ రిపోర్టులు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించగలరు
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత,
కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.
ఈ క్రింది నెంబర్లు ను ఫోన్ ద్వారా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించగలరు
9177108128, 9966847463

teenmaardesk@gmail.com

తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ఎక్కడైతే స్త్రీలు పూజించబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు

ములుగు | సంపుటి : 02 | సంచిక : 326 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | సోమవారం | 11 మార్చి 2024 | పేజీలు : 08 | వెల ₹ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

ఆపరేషన్ ఆకర్ష్‌తో బీజేపీ ఖుష్

అభ్యర్థుల ప్రకటనపై నాయకుల జోష్

బలమైన నేతలకోసం పక్కా వ్యూహం

లోక్ సభ ఎన్నికలకు ఇప్పటికే తెలంగాణలో 9 స్థానాలకు భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. పట్టున్న ప్రాంతాల్లో పకడ్బందీగా నేతలను బరిలో దింపిన కమలదళం.. మిగిలిన స్థానాల్లో బలమైన నేతల కోసం పక్కా వ్యూహంతో ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది.

తెలంగాణ బ్యూరో, మార్చి 10 (తీన్మార్ న్యూస్): ఇప్పటికే మొత్తం ఆరుగురు బిఆర్ఎస్ నేతలతో పాటు మరో నేత కాషాయ కండువా కప్పుకున్నారు. ఇద్దరికి చేరిన కొన్ని గంటల్లోనే తొలిజాబితాలో స్థానం దక్కింది. తాజాగా చేరిన నలుగురు నేతలకు టికెట్ కన్ఫర్మ్ అనే టాక్ వినిపిస్తోంది. బిజెపి స్టైల్‌లో జరుగుతున్న చేరికలను గమనిస్తే రాష్ట్రంలో బిఆర్ఎస్ టార్గెట్‌గా వెళ్తోంది. పక్కా ప్రణాళికతో బీఆర్ఎస్‌తో ఒరిగేదేమి లేదని ప్రచారం చేస్తూ.. కేంద్రలో

మిగతా 2 లో

భట్టి విక్రమార్క పగ పట్టిండు

రేవంత్ రెడ్డిని సీఎం చేద్దామన్నందుకు..
కంటతడి పెట్టుకున్న వీ. హనుమంతరావు
భట్టిని ఎమ్మెల్సీ, పీసీసీ చేసింది నేనే
నాకు ఖమ్మం ఎంపీ సీటు రాకుండా అడ్డుపడుతున్నడు
రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర అంటున్నాడు కానీ నాకు న్యాయం చేయట్లేదు

.. వివరాలు 2లో

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ముస్తాబైన భద్రాద్రి

మధ్యాహ్నం భద్రాచలం సీతారాములను దర్శించుకోనున్న సీఎం

తెలంగాణ బ్యూరో, మార్చి 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముస్తాబయింది. సోమవారం యాదాద్రి, కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఉదయం యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోనున్నారు. సోమవారం నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మొదటి రోజు పూజలలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పాల్గొనున్నారు. సీఎం అయ్యాక మొదటిసారి యాదాద్రి ఆలయాన్ని దర్శించుకోనున్నారు సీఎం రేవంత్. యాదాద్రి దర్శనం

మిగతా 2 లో

జాగృతి కమిటీలను రద్దు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రద్దు చేసిన కల్వకుంట్ల కవిత కమిటీల రద్దు వెంటనే అమలులోకి వస్తుందని ప్రకటనలో వెల్లడి

తెలంగాణ బ్యూరో, మార్చి 10 (తీన్మార్ న్యూస్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, భారత జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన నిర్ణయం తీసుకున్నారు. భారత జాగృతి అన్ని కమిటీలను రద్దు చేశారు. జాగృతి అధ్యక్షురాలు కవిత ఆదేశాల మేరకు

మిగతా 2 లో

ఒక రేషన్ కార్డుపై ఒక్కరికే గృహజ్యోతి

గృహజ్యోతి పథకంపై స్పష్టతనిచ్చిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఒక్క యూనిట్ ఎక్కువొచ్చినా పతకం వర్తించదని స్పష్టం

హైదరాబాద్, మార్చి 10 (తీన్మార్ న్యూస్): ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రభుత్వం అమలుచేస్తున్న గృహజ్యోతి పథకంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరింత స్పష్టతనిచ్చారు. ఒక రేషన్ కార్డుపై ఒక్కరికే ఇది వర్తిస్తుందని, 200 యూనిట్లలోపు విద్యుత్తును వాడుకున్న వారికే ఈ పథకం

మిగతా 2 లో

రాజకీయాలు కాకుండా రైతు ప్రయోజనాలపై దృష్టి సారించాలి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ

రైతులపక్షాన అండగా నిలుస్తాం : హరీష్ రావు

తెలంగాణ బ్యూరో, మార్చి 10 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం రాజకీయాలు కాకుండా రైతు ప్రయోజనాలపై దృష్టి సారించాలన్నారు మాజీమంత్రి హరీష్ రావు. నీళ్లు లేక కొత్త బోర్లు వేసుకొని రైతులపైన ఆర్థిక భారం పడుతుందని, ఆరుగాలం శ్రమించి వరి పంట సాగుచేస్తున్న అన్నదాతల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రంగనాయక సాగర్‌లోకి వెంటనే 1 టీఎంసి నీటిని ఎత్తిపోయాలని, ఆందోళనలో

మిగతా 2 లో

బీఎస్పీ,బీఆర్ఎస్ పొత్తు ఖరారు

సీట్ల పంపిణీపై స్పష్టత,త్వరలోనే ప్రకటన

పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ, బీఆర్ఎస్ ఉమ్మడిగా పోటీ చేస్తాయని వెల్లడి

డా..ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, మార్చి 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో బీఎస్పీ,బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తుకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి అనుమతి లభించిందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఇరు పార్టీలు కలిసి పోటీచేస్తాయని

మిగతా 2 లో



చీపురుతో బీఆర్ఎస్‌ను ఊడ్చేసినా సిగ్గురాలే

కేటీఆర్ వాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్

కరీంనగర్, మార్చి 10 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. కేటీఆర్‌కు కండకావరమెక్కి తన గురించి మాట్లాడుతున్నాడంటూ ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. కరీంనగర్‌లో

మిగతా 2 లో

కాళేశ్వరంపై బహిరంగ చర్చకు సిద్ధమా

బీఆర్ఎస్‌కు కోదండరాం సవాల్

.. వివరాలు 2లో

మరోసారి బయటపడ్డ బీఆర్ఎస్ కార్యకర్తల వర్గ విభేదాలు

మాజీ మంత్రి కేటీఆర్ ఎదురుగానే బాహాబాహీకి దిగిన కార్యకర్తలు

.. వివరాలు 2లో

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ముస్తాబైన భద్రాద్రి

మొదటి పేజీ తరువాయి

తర్వాత నేరుగా భద్రాచలం వెళతారు. మధ్యాహ్నం సీఎం భద్రాచలం సీతారాములను దర్శించుకోనున్నారు. అనంతరం భద్రాచలం మార్కెట్ యార్డ్ గ్రౌండ్‌లో సుమారు 5వేల మంది మహిళల సమక్షంలో ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం తర్వాత జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులు, భద్రాచలం ఆలయ అభివృద్ధిపై అధికారులతో కలిసి చర్చించనున్నారు. సాయంత్రం 4 గంటలకు మణుగూరు ప్రజాదీవెన సభలో సీఎం పాల్గొంటారు. 2016 తర్వాత ఫస్టైటైం భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి సన్నిధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రానుండటంతో భద్రగిరి దశ, దిశ మారుతుందని భక్తకోటి ఆకాంక్షిస్తోంది. మణుగూరులో జరిగే బహిరంగ సభ ద్వారా ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో లోక్ సభ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. మణుగూరులో జరిగే భారీ బహిరంగ సభలో కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ముఖ్యమంత్రి బహిరంగ సభను సక్సెస్ చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు తలమునకలయ్యాయి.

భట్టి విక్రమార్క పగ పట్టిండు

తెలంగాణ బ్యూరో, మార్చి 10 (తీన్మార్ న్యూస్): ఆదివారం సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ నేత వీ. హనుమంతరావు మాట్లాడుతూ కంటతడి పెట్టుకున్నారు. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ దయవల్ల, సోనియా, రాజీవ్ గాంధీల దయవల్ల కింది స్థాయి నుండి ఈ స్థాయికి వచ్చానని చెప్పుకచ్చారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు రేవంత్ రెడ్డి ముఖ్య పాత్ర పోషిస్తున్న సందర్భంగా రేవంత్ రెడ్డిని సీఎం గా చేద్దామని చెప్పినందుకు భట్టి విక్రమార్క నా పై పగ పట్టాడని చెప్పుకచ్చారు. వాస్తవానికి రాష్ట్రంలో కాంగ్రెస్ ని భలోపేతం చేసింది రేవంత్ రెడ్డి అని అన్నారు. కష్టపడ్డవాడికి అధికారం దక్కితే తప్పేంది అని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క ను కూడా ఒకానొక సందర్భంలో భట్టిని పీసీసీ చేసింది నేనే అని చెప్పారు. రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర అంటున్నాడు కానీ నాకు న్యాయం చేయట్లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు హనుమంతరావు. గత ఏడు ఎనిమిదేళ్లుగా నాకు ఏ పదవీ కూడా లేదు కనీసం స్టార్ కాంపెయిన్ కూడా లేదన్నారు. నేను కాంగ్రెస్ బలోపేతనికి.. పార్టీ కార్యక్రమాలకు కృషి చేశానని చెప్పుకచ్చారు. ఈ సందర్భంగా నాకు ఖమ్మం ఎంపీ సీటు రాకుండా బట్టి అడ్డుపడుతున్నడు అంటూ కంటతడి పెట్టుకున్నారు. ఈ అంశాన్ని పార్టీ పెద్దలు గమనించాలని, నన్ను గుర్తించాలను, నా అనుభవాన్ని వాడుకోవాలని వారు అభిప్రాయాన్ని వెళ్లుబుచ్చారు.

జాగృతి కమిటీలను రద్దు

మొదటి పేజీ తరువాయి

భారత జాగృతి విదేశీ, జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలు రద్దు చేసినట్లు జాగృతి కార్యాలయం ప్రకటించింది. కమిటీల రద్దు వెంటనే అమలులోకి వస్తుందని ప్రకటనలో వెల్లడించారు. కాగా, పార్లమెంట్ ఎన్నికల వేళ ఉన్నఫళంగా కవిత భారత జాగృతి అన్ని కమిటీలను రద్దు చేయడం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇంత సడెన్‌గా కవిత కమిటీల రద్దు చేయడానికి గల కారణాలేంటి అనే దానిపై జోరుగా చర్చ మొదలైంది. అయితే, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో గులాబీ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ పార్టీల వైపు చూస్తున్నారు. ఈ క్రమంలోనే భారత జాగృతి నేతలు సైతం కాంగ్రెస్, ఇతర పార్టీల్లోకి జంప్ అయ్యేందుకు సిద్ధమైనట్లు సమాచారం రావడంతో కవిత ముందే అప్రమత్తమై కమిటీల అన్ని రద్దు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత కమిటీల్లో ఉన్న నేతలు ఇతర పార్టీల్లోకి వెళ్తే.. ఆ ఎఫెక్ట్ తనతో పాటు బీఆర్ఎస్ పార్టీపై పడుతోందని అలర్ట్ అయ్యే కవిత కమిటీలన్నీ రద్దు చేసి.. విధేయులతో త్వరలోనే కొత్త కమిటీలు ఏర్పాటు చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే, కవిత సడెన్‌గా భారత జాగృతి కమిటీలు అన్ని రద్దు చేయడానికి గల అసలు కారణాలు ఏంటన్నది మాత్రం తెలియాల్సి ఉంది.

చీపురుతో బీఆర్ఎస్‌ను ఊడ్చేసినా సిగ్గురాలే

మొదటి పేజీ తరువాయి

మీడియాతో మాట్లాడిన ఆయన కేటీఆర్ తనపై చేసిన కామెంట్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎంపీగా బండి సంజయ్ చేసిందేమీ లేదంటూ కేటీఆర్ చేసిన కామెంట్స్‌కు తీవ్రంగా స్పందించిన ఆయన పార్లమెంట్ రికార్డులు చూసుకోవాలంటూ కౌంటర్ ఇచ్చారు. తానేం చేశానో పార్లమెంట్ రికార్డులు చెబుతాయన్నారు బండి సంజయ్. పార్లమెంట్‌కు వెళ్లకుండా తాగి పడుకున్న చరిత్ర కేసీఆర్‌ది అంటూ బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజలు చీపురుతో బీఆర్ఎస్‌ను ఊడ్చేసినా సిగ్గురాదేంటూ వ్యాఖ్యానించారు. ఏం సాధించారని కరీంనగర్ కదనభేరి నిర్వహిస్తున్నారంటూ కేటీఆర్‌ను ప్రశ్నించారు బండి సంజయ్ కుమార్. కరీంనగర్ సభ సాక్షిగా కేసీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారాయన. తాను బరాబర్ హిందుత్వం గురించి మాట్లాడుతానని, దమ్ముంటే మీరు బాబర్, ఔరంగజేబు గురించి మాట్లాడాలని బీఆర్ఎస్ నేతలకు బండి సంజయ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో ప్రజల కోసం బీజేపీ పోరాడితే.. ప్రజలు మాత్రం కాంగ్రెస్‌కు ఓటు వేశారని, ఇది ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు బండి సంజయ్ కుమార్. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మోదీ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారాయన. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీపై బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. మరికొద్ది రోజుల్లో కాంగ్రెస్ చెప్పిన 100 రోజులు పూర్తవుతుందన్నారు. 6 గ్యారంటీలను నాలుగు రోజుల్లో అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కేబినెట్‌లో వాటికి ఆమోదం తెలిపి నిధులు విడుదల చేయాల్సిందేనని అన్నారు.

మరోసారి బయటపడ్డ బీఆర్ఎస్ కార్యకర్తల వర్గ విభేదాలు

కామారెడ్డి, మార్చి 10 (తీన్మార్ న్యూస్): కామారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎదురుగానే కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. సీనియర్ నాయకుడు కొమ్ముల తిర్మల్ రెడ్డి ప్రసంగంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేరు ప్రస్తావించకపోవడంతో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేదికపై ఉన్న నేతలందరి పేర్లు చెప్పి గంప గోవర్ధన్ పేరు చెప్పక పోవడంతో వేదిక పైకి కార్యకర్తలు దూసుకువచ్చారు. కేటీఆర్ ఎంత వారించినా వినకుండా గోవర్ధన్ అనుచరులు ఆందోళనకు దిగారు. ఈ సమావేశంలో ఇరుపక్షాలు బాహాబాహికి దిగాయి. దాంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది.

బీఎస్పీ,బీఆర్ఎస్ పొత్తు ఖరారు

మొదటి పేజీ తరువాయి

ప్రకటించారు. బీఎస్పీ-బీఆర్ఎస్ పార్టీల కూటమి చర్చలపై రాష్ట్రంలో ఏర్పడిన సందిగ్ధానికి బెహన్జీ మాయావతి కొద్ది సేపటి క్రితమే తెరదించారని ఆయన వివరించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ఎన్డీయే, ఇండియా కూటమిలో లేనందున ఆ పార్టీతో కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేయడానికి పార్టీ హై కమాండ్ అనుమతించిందని తెలిపారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీఎస్పీ,బీఆర్ఎస్ పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసే స్థానాలపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు వివరించారు. బీఎస్పీ, బీఆర్ఎస్ కూటమి కలిసి పోటీ చేసే స్థానాలపై త్వరలోనే సంయుక్త ప్రకటన ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో జరిగే తదుపరి చర్చలకు పార్టీ రాజ్యసభ ఎంపీ, కేంద్ర సమన్వయకర్త రాంజీ గౌతమ్ బెహన్జీ దూతగా హాజరుకానున్నారని తెలిపారు. ఇరు పార్టీల మధ్య సీట్ల పంపకాలు, ఉమ్మడి భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే సంయుక్తంగా మీడియాకు వెల్లడిస్తామన్నారు. బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తులపై మీడియాలో వస్తున్న నిరాధారమైన వార్తలు, వదంతులు, దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు, ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

ఆపరేషన్ ఆకర్ష్‌తో బీజేపీ ఖుష్

మొదటి పేజీ తరువాయి

తమ విజయ అవకాశాలను ఎరగా వేసి నేతలను పార్టీలోకి చేర్చుకుంటోంది. బిజెపి వ్యూహంతో బిఆర్ఎస్ ఖాళీ అవుతుంటే.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ కు కఠినమైన పరీక్ష ఎదరవ్వక తప్పదనిపిస్తోంది. రాష్ట్రంలో డబుల్ డిజిట్ టార్గెట్‌తో దూసుకెళ్తున్న కమలం పార్టీ మిగిలిన రెండు పార్టీలకు ట్రబుల్ క్రియేట్ చేస్తోంది. తమకు బలమైన అభ్యర్థులు లేని చోట బిజెపి ఆచీతూచి అడుగేస్తోంది. బిఆర్ఎస్‌లో సిట్టింగ్ లేదా మాజీలకు గాలం వేస్తోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్‌ను వీడేందుకు ఆ పార్టీ నేతలు పక్క చూపులు చూస్తున్నారు. అందులో లోక్ సభ ఎన్నికలకు పనికొవచ్చే వారిని కమలదళం ఒడిసిపట్టుకొని పార్టీలో చేర్చుకుంటోంది. ఆ కోవలోనే సిట్టింగ్ ఎంపీలు బిబి పాటిల్, పొతుగంటి రాములు కాషాయం కండువా కప్పుకోవడం.. బిబి పాటిల్ కు జహిరాబాద్ టికెట్, రాములు కుమారుడు భరత్‌కు నాగర్ కర్నూలు స్థానం ఇవ్వడం చకాచకా జరిగిపోయాయి. మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ స్థానాలకు సరైన అభ్యర్థుల కోసం ఎదురుచూస్తున్న బిజెపి.. అసంతృప్త బిఆర్ఎస్ నేతలతో టచ్‌లోకి వెళ్లింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీతారాం నాయక్‌తో కిషన్ రెడ్డి ఇంటికి వెళ్లి నేరుగా పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందే బ్యాక్ గ్రౌండ్ హోం వర్క అంతా బిజెపి పూర్తి చేసింది. ఖమ్మం నుంచి జలగం వెంకట్ రావుతో చర్చలు జరిపి పార్టీలో చేర్చుకున్నారు. ఆదిలాబాద్ నుంచి మాజీ ఎంపీ నగేశ్‌ను ఒప్పించి బిజెపిలోకి లాక్కున్నారు. నల్గొండ స్థానానికి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి సైలెంట్‌గా బిజెపిలోకి వచ్చేశారు. పెద్దపల్లి శ్రీనివాస్‌ను జాయిన్ చేసుకున్నారు. ఇలా అందివచ్చిన నేతలను చేజారిపోకుండా.. చాకచాక్యంగా బిజెపి పార్లమెంటరీ బోర్డు మెంబర్, ఎంపీ లక్ష్మణ్ ఢిల్లీ తీసుకెళ్లి దగ్గరుండి పార్టీ కండువాలు కప్పిస్తున్నారు. బిఆర్ఎస్‌ను ఖాళీ చేయడమే లక్ష్యంగా చేరికలు సాగుతున్నాయి. ఓ వైపు చేరికలతో గులాబీ పార్టీని ఖాళీ చేస్తున్న బిజెపి.. మరోవైపు బలమైన ప్రత్యర్థులను రెడీ చేస్తూ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి సవాల్ విసురుతోంది. దీంతో చాలా చోట్ల కాంగ్రెస్‌కు టఫ్ ఫైట్ తప్పకపోవచ్చు. మెజార్టీ స్థానాల్లో గెలుస్తామని కాషాయదళం ధీమా వ్యక్తం చేస్తూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను కంగారుపెడుతోంది. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజుల్లో అమలులో విఫలమైందని బిజెపి తూర్పారపడుతోంది. పదేళ్ల మోడీ పాలనకు ఓటు వేయమని అడిగే దమ్ము తమకు ఉందని.. రాహుల్ గాంధీ పేరు చెప్పి ఓట్లు అడిగే దమ్ము కాంగ్రెస్‌కు ఉందా అంటూ సవాల్ విసు-రుతోంది. కాంగ్రెస్‌ను హామీలపై విడిచిపెట్టబోమని.. లోక్ సభ ఎన్నికల్లో అధిక స్థానాల్లో జయకేతనం ఎగురవేసి మరింత పోరాటం చేస్తామని బిజెపి అంటోంది. బిజెపిలోకి వలసలు ఇంకా కొనసాగుతాయని ఆ పార్టీ సంకేతాలు ఇస్తోంది. వరంగల్ నుంచి ఓ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేతో చర్చలు జరుగుతున్నట్లు చెబుతున్నాయి పార్టీ వర్గాలు. అభ్యర్థుల ప్రకటనతోనే కాదు.. మిగిలిన స్థానాల్లో అనువైన నేతల కోసం బిజెపి కచ్చితమైన ప్రణాళికతో ఇటు బిఆర్ఎస్.. అటు కాంగ్రెస్‌ను కలవరపెడుతోంది.

మానవతా దృక్పదాన్ని చాటుకున్న మంత్రి కొండా సురేఖ

రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు

తెలంగాణ బ్యూరో, మార్చి 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దయా హృదయంతో తన ఉదారతను చాటుకున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె తిరుగు మార్గంలో హైదరాబాద్ బయలుదేరారు. మార్గమధ్యంలో వెళుతుండగా బైక్ అదుపుతప్పి పడిపోయిన క్షతగాత్రులను చూసి వెంటనే ఆగారు. వారిని చూసి అంబులెన్సుకు కాల్ చేయించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే వరకు అక్కడే ఉన్నారు. అంతేగాక పడిపోయిన వాహనాన్ని స్థానిక పోలీసులను పిలిపించి వాళ్ల సంబందికులకు అప్పగించాలని తెలిపారు. అలాగే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని పోలీసులకు సూచించారు.

ఆదివారం ఉదయం మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఫిట్స్ వచ్చి పడిపోయిన వ్యక్తికి సహాయ సహకారాలు అందించి, అంబెలెన్స్ లో దగ్గరుండి ఆసుపత్రికి పంపించారు. దీంతో తమ ఉదారతను చాటుకున్న కాంగ్రెస్ మంత్రులపై నెట్టింట ప్రశంసల జల్లులు కురు-స్తున్నాయి. ఉన్నత పదవిలో ఉండి కూడా అహంకారం ప్రదర్శించకుండా, ప్రజలకు సహాయం చేస్తున్న వారికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

ఎక్కడైతే స్త్రీలు పూజించబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు

సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రాజకీయ రంగాల్లో మహిళలు రాణించాలి

మరో మదర్ థెరిస్సా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

ములుగు, మార్చి 10 (తీన్మార్ న్యూస్): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ తస్లీమా అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హాజరై

మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ గా ఉద్యోగం చేస్తూ సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవ చేస్తూ మానవత్వాన్ని చాటుతున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా కు అభినందనలు తెలుపుతూ ఆదివారం ములుగు జిల్లా కేంద్రములో మహిళా దినోత్సవ వేడుకలు ఇంత ఘనంగా నిర్వహించడం సంతోషదాయకం మని సమాజంలో మహిళ లేకుండా సృష్టి లేదు. కానీ మగవాళ్ల భావజాలం మార్చాల్సిన అవసరం ఉంది. ఎక్కడైతే స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని చెబుతారు. సమస్యలకు పారిపోకుండా ఎదుర్కోవాలి, అప్పుడే మనకంటూ ఓ విజయం ఉంటాది. మనమంటూ ఓ చరిత్రలో నిలబడతాం మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసే సమాజం సరికాదన్న ఆమె, ఒకనాడు మాతృస్వామిక సమాజం నుంచి నెమ్మదిగా పితృస్వామ్యం దిశగా పరిస్థితులు మారాయన్నారు. మహిళా దినోత్సవ స్ఫూర్తిని అందిపుచ్చుకొని అతివలంతా ఆర్థికంగా బలంగా మారడంతో పాటు సామాజిక, రాజకీయ రంగాల్లోనూ ఉన్నత స్థానాలకు చేరాలని మంత్రి వర్యులు సీతక్క ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలుతో పాటు మహిళా సోదరీమణులు పాల్గొన్నారు.

రాజకీయాలు కాకుండా రైతు ప్రయోజనాలపై దృష్టి సారించాలి

మొదటి పేజీ తరువాయి

ఉన్న రైతుల సమస్యను పరిష్కారించకుంటే పోరాటానికి సిద్ధం అన్నారు. రైతులపక్షాన అండగా నిలుస్తాం అన్నారు. సిద్దిపేట జిల్లా రైతాంగ ప్రయోజనాల దృష్ట్యా ఒక లేఖ ద్వారా కొన్ని ముఖ్యమైన అంశాలు తమ దృష్టికి తీసుకువస్తున్నానన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతుల పక్షాననిలబడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లో సాగుచేస్తున్న యాసంగి పంటలు చేతికి రావాలంటే వెంటనే సాగు నీరందించాలని విజ్ఞప్తి చేశారు. గడిచిన నాలుగేళ్లలో ముందస్తు ప్రణాళిక ప్రకారం రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సరిపడా సాగునీటిని అందుబాటులో ఉంచడం జరిగిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో అలసత్వం వహిస్తున్నట్లుగా అర్థమవుతుందన్నారు. ఓ పక్క సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. కళ్ళముందే ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారని చెప్పారు. కొత్త బోర్లు వేయిస్తూ అప్పుల పాలవుతున్నారని.. వ్యవసాయ బావులకు సంబంధించి పూడికతీత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారని తెలిపారు. ఈ దుస్థితిని అధిగమించాలంటే వెంటనే రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లోకి 1 టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని కోరారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుండి కూడా తక్షణమే నీటిని విడుదల చేయాలన్నారు. రైతులకు తగిన పరిష్కారం చూపించకుంటే త్వరలోనే రైతుల పక్షాన పోరాటాలకు సైతం సిద్ధమవుతామని స్పష్టం చేసారు.

ఒక రేషన్ కార్డుపై ఒక్కరికే గృహజ్యోతి

మొదటి పేజీ తరువాయి

వర్తిస్తుందని, అంతకంటే ఒక్క యూనిట్ ఎక్కువొచ్చినా వర్తించదని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. 200 యూనిట్ల లోపున్నా బిల్లులు ఇస్తున్నారన్న విలేకరుల ప్రశ్నకు భట్టి స్పందిస్తూ అలా వచ్చినవారు బిల్లు కట్టాల్సిన పనిలేదని పేర్కొన్నారు. రేషన్‌కార్డు, సర్వీస్ నంబర్, ఆధార్‌కార్డును ప్రజాపాలన అధికారికి అప్పగిస్తే ఆటోమెటిక్‌గా జీరో బిల్లు వస్తుందని వివరించారు. గృహజ్యోతి పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 40,33,702 మందికి జీరో బిల్లులిచ్చినట్లు తెలిపారు. వ్య వసాయ మోటర్లకు మీటర్లు బిగించబోమని చెప్పారు. రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలున్న భూముల సమాచారం తమవద్ద లేదని, ఈసారికి వాటికి కూడా రైతుభరోసా నిధులు జమచేస్తున్న ట్టు తెలిపారు. ఇప్పటి వరకు మూడెకరాల లోపు ఉన్న రైతులకు%ఱ% నిధులు వేశామని, ప్రస్తుతం నాలుగెకరాలు ఉన్న రైతులకు నిధులు జమచేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఐదెకరాల రైతులకు నిధులు పంపిణీ చేస్తామన్నారు. గత ప్రభుత్వం కొండలు, గుట్టలున్న బడాబాబులకు రైతుబంధు నిధులు జమచేసి రూ.20 వేల కోట్లను దుర్వినియోగం చేసిందన్న వ్యాఖ్యలను గుర్తుచేసిన విలేకరులకు మంత్రి భట్టి పైవిధం గా సమాధానం ఇచ్చారు. మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేసేందుకు త్వరలోనే మైక్రోస్కాల్ ఇండస్ట్రీ పార్కులను ప్రారంభిస్తామని మంత్రి భట్టి తెలిపారు. 12న వడ్డీలేని రుణ పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది విద్యుత్తు వినియోగం రికార్డుస్థాయిలో పెరిగిందని, మార్చి 8న 15,623 మెగావాట్ల విద్యుత్తు వినియోగమైనట్టు చెప్పారు. నిరుడు అదే రోజున 15,497 మెగావాట్లు వినియోగమై, ఇప్పుడా రికార్డు బద్దలైందని తెలిపారు. 16,500 మెగావాట్ల విద్యుత్తును సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని, కాబట్టి ప్రజలు నిశ్చింతగా ఉండాలని కోరారు. త్వరలోనే పవర్ పాలసీ ప్రకటిస్తామని పేర్కొన్నారు. ప్రెస్‌మీట్‌లో ఇంధనశాఖ కార్యదర్శి, టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ మూర్తుజా రిజ్వీ, టీఎస్ జెన్‌కో జేఎండీ కృష్ణభాస్కర్, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూకీ పాల్గొన్నారు.

కాళేశ్వరం పై బీఆర్ఎస్ కు కోదండరాం సవాల్

హైదరాబాద్, మార్చి 10 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం పై బీఆర్ఎస్ అబద్దాలు చెబుతోందని, కాగ్ చెప్పిన వాస్తవాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం సవాల్ చేశారు. కాళేశ్వరంతో ఎలాంటి ఉపయోగం ఉండదని తెలిసి కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పుడు నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా ఆదివారం కోదండరాం సోమాజిగూడ వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితికి పని చేసిన హన్మంతరావు సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టవద్దన్నప్పటికి కేసీఆర్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదన్నారు. కాగ్ నివేదికలో ఉన్న అంశాలు మనమే స్వంతంగా రాసినట్టుందని.. ప్రాజెక్ట్ నిర్మాణానికి ముందు ఆర్థిక అంశాల గురించి అంచనా వేయకుండా నిర్మించారని ఆరోపించారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులను కొందరికి గుండు గుత్తగా కేటాయించారని కాగ్ వెల్లడించిందన్నారు. కాళేశ్వరం ద్వారా రైతులకు సాగు నీరు అందించడం చాలా కష్టమని, ఒక ఎకరాకు నీరందించడానికి 46 వేల రూపాయలు ఖర్చు అవుతుందని కోదండరాం అన్నారు. రాష్ట్రంలో 60 శాతం విద్యుత్ కాళేశ్వరం నిర్వహణకు అవసరం ఉంటుందని, కాళేశ్వరం ప్రాజెక్టులో మల్లన్న సాగర్ నిర్మాణం వల్ల ఆ ప్రాంతంలో భూకంపలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కేవలం కొండ పోచ్చమ్మ కాలువ నిర్మాణానికి రూ. 70 కోట్లు కేటాయించారని, గతంలో కడెం ప్రాజెక్ట్ మట్టి మాత్రమే కొట్టుకుపోయిందని తర్వాత జరిగిన నిర్మాణంలో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజ్‌లో పిల్లర్లు కుంగాయి ఇంటికి ఒక్క పిల్లర్ కుంగితే ఇల్లు నిలబడుతుందా.. అని కోదండరాం ప్రశ్నించారు. కాళేశ్వరంలో మేడిగడ్డ నుంచి 80 శాతం నీళ్లు అందించే బ్యారేజ్ అదే పగుళ్ళు చూపిందన్నారు. కుంగింది మూడు పిల్లర్లు మాత్రమే కాదని కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు లక్షకు రూ. 87 వేలకోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా కుప్పకూల్చారని తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ఇంజనిరింగ్ వ్యవస్థ నిర్వర్యం జరిగిందని దీనిపై సమగ్రంగా విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.